ఎటు చూసినా జ్వరాలే..

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- డెంగీ కేసుల నమోదు


రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో జ్వరంతో చేరిన రోగులు

కంబాలచెరువు: ప్రస్తుతం ఎవరిని కదిపినా ఒంట్లో బాలేదు, ఒళ్లంతా నొప్పులు, రొంప, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నామనే మాటే. అయితే ఈ జ్వరాలు ప్రారంభంలో కొంతమందికి పలు విభిన్న లక్షణాలతో మొదలవుతున్నాయి. కొంతమందికి కడుపులో నొప్పితో ప్రారంభమై జ్వరపీడితులుగా మారి మంచాన పడుతున్నారు. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు ఒక కారణమైతే, అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని వీధుల్లో పెరిగిపోయిన దోమలు మరో కారణం అవుతున్నాయి. మున్సిపల్ శాఖ ఫాగింగ్ అనే మాటనే పూర్తిగా మర్చిపోయింది. గతంలో సాయంత్రం, రాత్రి సమయాల్లో దోమలు అధికంగా ఉండే ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేసేవారు.

పెరుగుతున్న డెంగీ కేసులు

రాజమహేంద్రవరం డివిజన్‌లో డెంగీ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఈ జ్వరం కేవలం దోమకాటు వల్ల మాత్రమే సోకుతుంది. జాంపేట సమీపంలోని మెరక వీధిలో బుధవారం ఒక డెంగీ కేసు నమోదైంది. 20 రోజుల్లో రాజమహేంద్రవరం డివిజన్‌లో మొత్తం ఐదు కేసులు వచ్చాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 23 డెంగీ, ఈ నెలలో 2,450 సాధారణ జ్వరం కేసులు నమోదయ్యాయి. నిత్యం అనేక మంది సాధారణ జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే ఓపీ కేసుల్లో అధికంగా జ్వరాల బాధితులే ఉంటున్నారు. ఈ పరిణామంతో వైద్య, ఆరోగ్య శాఖాధికారులు పూర్తిగా అప్రమత్తమవ్వాల్సిన అవసరం ఉంది. వైద్యాధికారులు, సిబ్బంది, మున్సిపల్ శాఖాధికారులు, ఆశా వర్కర్లు వార్డుల్లో పర్యటించి డెంగీ జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి.

డెంగీ లక్షణాలు

డెంగీ బారిన పడిన వారు వాటి లక్షణాలను వెంటనే గుర్తించి తగు వైద్య సహాయం పొందితే త్వరగా కొలుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి బాధితులకు తలనొప్పి, కండరాల నొప్పి, కీళ్లనొప్పి, వికారం, వాంతులు, కళ్ల వెనుక నొప్పి తదితర లక్షణాలు ఉంటాయి. జ్వరం అధికంగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డెంగీ జ్వరం సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటే దాని బారి నుంచి తప్పించుకోవచ్చు. ప్రధానంగా ఇంటి బయట, లోపల నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్త పడాలి. చాలామంది ఇళ్లలో ఇండోర్ మొక్కలను పెంచుతుంటారు. వీటిలో కొన్నింటికి మొక్క కుండీల్లో నీరు నిల్వ చేయాలి. ఆ విధంగా నిల్వ చేసిన నీటిలో దోమ లార్వా అభివృద్ధి చెందుతుంది. తద్వారా డెంగీ దోమ పెరిగి ఇంటిలో కుటుంబ సభ్యులను కుట్టడం ద్వారా జ్వరం సోకిన సంఘటనలు ఉన్నాయి. ఇంటి పరిసర ప్రాంతాల్లో టైర్లు, ఖాళీ కొబ్బరి చిప్పలు లేకుండా చూసుకోవాలి. దోమలు ఇంటిలోకి రాకుండా మెస్‌లు వంటివి ఏర్పాటు చేసుకుని, దోమల నివారణ దిశగా చర్యలు చేపట్టాలి.

డెంగీ జ్వరం లక్షణాలివే..



డెంగీ జ్వరం 4 నుంచి 5 రోజుల పాటు ఉంటుంది. జ్వరం తగ్గిన తర్వాత శరీరంలో నీరసం, వాంతులు అవడం, తల విసరడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. నూటికి 90 శాతం మందిలో ప్లేట్ లెట్లు తగ్గినా వాటికవే మళ్లీ పెరిగిపోతాయి. విపరీతమైన వాంతులు అవుతుంటే వెంటనే వైద్యుని సంప్రదించాలి. సాధారణ డెంగీ జ్వరం అయితే ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. జ్వరం వస్తే పారాసిట్‌మాల్ టాబ్లెట్ వేసుకోవాలి. చాలామంది పలు రకాల మొక్కల రసం రోగికి పట్టిస్తున్నారు. ఇది ఎక్కడా ఇప్పటి వరకూ సైంటిఫిక్‌గా నిర్ధారణ జరగలేదు. ఇటువంటి చర్యల వల్ల రక్తపు వాంతులు అయ్యే ప్రమాదం కూడా ఉంది.

– డాక్టర్ వడ్డాది సురేష్, వడ్డాది ఆసుపత్రి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

సతీష్ కుమార్‌కు ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సతీష్ కుమార్

సీటీఆర్ఐ: జీఎస్‌జే మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు చల్లగాని సతీష్ కుమార్ సేవలు అభినందనీయమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రామ్‌నగర్‌లోని బండారు దత్తాత్రేయ నివాసంలో గురువారం ఎక్సలెన్స్ 2024 జాతీయ పురస్కారాన్ని చల్లగాని సతీష్ కుమార్‌కు అందజేశారు. సామాజిక అంశం కేటగిరిలో తనకు ఈ అవార్డు లభించిందని సతీష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి రాజాయోనా తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు సందర్శన


సెంట్రల్ జైలులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు గురువారం సెంట్రల్ జైలును సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ఇతర వసతులను పరిశీలించారు. కారాగారంలోని ఖైదీలతో మాట్లాడారు. వారి తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటీషన్లు, హైకోర్టుల్లో అప్పీలు వేయాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందన్నారు. ఇందుకోసం సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా తమ అర్జీలను అందించాలన్నారు.

టీచర్ సన్యాసిరావుపై చర్యలకు డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ: శాటిలైట్ సిటీ ఏ బ్లాక్‌లోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న సన్యాసిరావు లైంగిక వేధింపుల కేసు విషయంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మికి గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ ప్రతినిధి వరదా నాగేశ్వరరావు, మహిళా కన్వీనర్ ఆకుల విజయ భారతి కోరారు. జిల్లా పర్యటనకు గురువారం విచ్చేసిన ఆమెను ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందించారు. విద్యార్థినులపై లైంగిక వేధింపుల విషయంలో సన్యాసిరావుపై బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్ట ప్రకారం ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారని, ఇప్పటి వరకూ నిందితుడిని అరెస్ట్ చేయలేదన్నారు. చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను, కృష్ణ చైతన్య, ముత్యాల పోసికుమార్, వనచర్ల సుజాత ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ గురువారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆర్అండ్‌బీ వాంబే గృహాలు, రాజీవ్ గాంధీ కాలనీ, మున్సిపల్ కాలనీ, రత్నంపేట, కోరుకొండ రోడ్డులోని రాజా థియేటర్, పేపర్ మిల్ క్వార్టర్లు, సొసైటీ బిల్డింగ్‌లు, రాందాస్ పేట, గాదిరెడ్డి నగర్, ఇందిరానగర్, శ్రీరామ్ నగర్, దుర్గానగర్, మల్లయ్యపేట, శాంతినగర్, వెంకట నగరం ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

- ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ ఆర్టీఓ కార్యాలయం, వాటర్ ట్యాంక్, గాంధీపురం, నారాయణపురం, మేనకా బార్, ఆంధ్రాబ్యాంక్, సుబ్బారావుపేట, ఎస్‌బీ మోటార్స్, సుబ్రహ్మణ్యం నగర్, సైక్లోన్ కాలనీ ప్రాంతాలలో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ గోకవరం బస్టాండ్, దేవీచౌక్, సూర్య థియేటర్, రామచంద్రరావుపేట, కొర్లంపేట, తుమ్మలావ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

సినిమాలు

శ్యామల	35 చిన్నకథకాదు
సూర్యమినీ	ట్రాన్స్‌ఫార్మర్స్–1
సూర్యప్యాలెస్	శివాజీ
స్వామి	సరిపోదా శనివారం
అశోక	ఆయ్
శివజ్యోతి	మత్తు వదలరా–2
అనుశ్రీ	మత్తు వదలరా–2
రాజా	మత్తు వదలరా–2
రంభ	హైడ్ అండ్ సీక్, కళింగ
ఊర్వశి	100క్రోర్స్, కమిటీ కుర్రోళ్ళు
మేనక	జర్నీ, డెక్టెట్స్
కుమారి	డిమోంటీ కాలనీ–2, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్)
అప్సర	సరిపోదా శనివారం
నామవరం	
వీఎస్ మహల్	ఏఆర్ఎం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	మత్తు వదలరా–2
కడియం	
వెంకటసూర్య	మత్తు వదలరా–2

ఉపాధ్యాయుల సంక్షేమానికి ఏపీటీఎఫ్ కృషి


జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

కంబాలచెరువు: ఉపాధ్యాయుల సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ప్రధాన ధ్యేయమని జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక నెహ్రూ నగర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కె.డేవిడ్ లివింగ్ స్టన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ 80 ఏళ్లుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతోందన్నారు. రాబోయే కాలంలో మరిన్ని విజయాలను సొంతం చేసుకుంటూ శత జయంతి ఉత్సవాలు జరుపుకోవడానికి పరుగులు పెడుతోందన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు వి.అప్పయ్య శాస్త్రి మాట్లాడుతూ జిల్లాలో ఏపీటీఎఫ్ ఒక బలీయమైన సంఘంగా అన్ని సమస్యలపై పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం మాట్లాడుతూ విజయనగరంలో అక్టోబర్ 6, 7, 8 తేదీలలో జరిగే రాష్ట్ర మహాసభలను, 80 వసంతాల వేడుకలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వైవీ రామారావు, నగర శాఖ గౌరవాధ్యక్షులు ఎం.సత్యనారాయణ, నగర శాఖ అధ్యక్షుడు ఎన్.గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి జి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

హాస్యనటుడు రేలంగి విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎంపీ భరత్ రామ్ తదితరులు

సీటీఆర్ఐ: గోదావరి గట్టుపై గౌతమీ నందన వనం దగ్గర రాజమండ్రి గౌడ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన హాస్యనట చక్రవర్తి రేలంగి కాంస్య విగ్రహావిష్కరణ గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సమయ స్ఫూర్తితో హాస్యం పండించడంలో రేలంగి వెంకట్రామయ్య దిట్ట అన్నారు. పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి హాస్యనటుడు రేలంగి అని కొనియాడారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ తన తండ్రి ఎన్టీఆర్‌తో రేలంగికి అవినాభావ సంబంధం ఉందన్నారు. మిస్సమ్మ సినిమాలో ఎన్టీఆర్, రేలంగి నటనకు సంబంధించిన డైలాగులను ఎంపీ పురందేశ్వరి ఈ సందర్భంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీ భరత్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


ప్రతిజ్ఞ చేస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు అన్ని సచివాలయాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతిజ్ఞ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది తాము ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాము నివసించే ప్రాంతాలలో కూడా ప్రజలు పరిశుభ్రతను పాటించేలా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అక్టోబర్ 2వ తేదీ వరకూ నిర్వహించే కార్యక్రమాలలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రానున్న రోజుల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, నగరాన్ని స్వచ్ఛ రాజమహేంద్రవరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, డీడీ రామారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదరా అలీ, మేనేజరు అబ్దుల్ మాలిక్ అస్సర్ పాల్గొన్నారు.

9,718 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

కంబాలచెరువు: అక్రమంగా తరలిస్తున్న 9,718 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్టు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని పోస్టాఫీసు వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వాహనంలో 198 బస్తాలలో నింపిన 9,718 కేజీల బియ్యాన్ని గుర్తించామన్నారు. వాహన యజమాని, బియ్యం కొనుగోలుదారుడు పడాల నాగ సూర్యనారాయణ శివ సూచనల మేరకు అనపర్తి ఏరియాలోని కోళ్లఫారాలకు ఈ బియ్యం తరలిస్తున్నట్టు కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన వాహన డ్రైవర్ ఊట దుర్గాప్రసాద్ తెలిపాడన్నారు. పడాల నాగ సూర్యనారాయణ దేవరాపల్లి మండలం పరిసర ప్రాంతాల కార్డుదారుల నుంచి ఈ బియ్యాన్ని కొనుగోలు చేశాడన్నారు. కాగా.. సుమారు రూ 26,27,135 విలువైన ఆ బియ్యం, వాహనాన్ని రాజమండ్రి రూరల్ సివిల్ సప్లయ్ అధికారులు సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. అక్రమ రవాణా చేస్తున్న సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదుకు పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేశారు. తనిఖీలో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, నవీన్ కుమార్, వలీ, వీరబాబు, సీఎస్‌డీటీ నాగలక్ష్మి పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక ప్రారంభం


స్కూల్ గేమ్స్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న అర్బన్ డీఐ దిలీప్ కుమార్

ప్రకాశం నగర్: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక ప్రారంభమైంది. అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ రిబ్బన్ కత్తిరించి ఈ ఆటల పోటీలు, ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం బాలురకు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, ఖోఖో, యోగాల్లో ఎంపిక జరుగుతుందన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25వ తేదీన కాకినాడలో జరిగే జిల్లాస్థాయి ఎంపిక ప్రక్రియకు హాజరవుతారన్నారు. సిటీ నియోజకవర్గంలోని 40 పాఠశాలల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుబ్రహ్మణ్యం, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఏవీడీ ప్రసాదరావు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ జె.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం


సమావేశంలో మాట్లాడుతున్న స్వామి పరిజ్ఞానంద

రాజానగరం: దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన వివేకానందుని ఆదర్శంగా తీసుకుని, జన్మభూమి కీర్తిప్రతిష్టలను పెంపొందించే దిశగా యువత పయనించాలని రామకృష్ణ మిషన్ రాజమండ్రి కేంద్రం కార్యదర్శి స్వామి పరిజ్ఞానంద అన్నారు. చికాగోలో జరిగిన విశ్వమత మహాసభలలో స్వామి వివేకానందుడు ప్రసంగించి 131 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 27న రాజమహేంద్రవరంలో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై కళాశాల యువతను చైతన్యపరుస్తూ గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామి పరిజ్ఞానంద మాట్లాడుతూ వివేకానందుడు గొప్ప మేధావి, దేశాభివృద్ధి కోసం తన జీవితాన్నే త్యాగం చేసి గొప్ప దేశభక్తుడని కొనియాడారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ శివారు ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని విద్యుత్ శాఖ డీ–7 సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ బేతా అప్పారావు గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 6వ తేదీన మద్దిపాటి శ్రీలత పొలం పక్కన విద్యుత్ స్తంభానికి సరఫరా రావడం లేదని ఫిర్యాదు వచ్చింది. ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపరు వేరు కనిపించలేదు. దాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని బేతా అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎర్రమట్టిపై పన్ను తొలగించాలి

కడియం: మునుపెన్నడూ లేని విధంగా ఎర్రమట్టిపై వేలాది రూపాయలు పన్నుగా విధించారని, ఆ పన్నులను తొలగించి నర్సరీ రంగాన్ని కాపాడాలంటూ కడియం నర్సరీ రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మొరపెట్టుకున్నారు. విజయవాడలో గురువారం చంద్రబాబును కడియం నర్సరీ రైతులు కలిశారు. నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు ఎంతో కీలకమైన మట్టిపై పన్నులను విధిస్తే, నర్సరీలపై ఆధారపడిన కుటుంబాలకు ఇబ్బందులు తప్పవని వాపోయారు.

గుడ్డ సంచుల వాడకాన్ని ప్రోత్సహించాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులను వాడుకలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లంక సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీ కార్యాలయంలో ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరికి వినతిపత్ర సమర్పించారు. లంక సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర విధానాలను ప్రవేశ పెట్టాలన్నారు.

స్ఫూర్తి ట్రస్ట్ సేవలు అభినందనీయం


వృద్ధులకు భోజనం పంపిణీ చేస్తున్న ముద్దాల అను దంపతులు

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఏపీ స్టేట్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను అన్నారు. ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో చైర్మన్ ముత్యాల పోసికుమార్ దంపతుల ఆధ్వర్యంలో గురువారం ముద్దాల అను పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం ముద్దాల అను దంపతుల చేతుల మీదుగా వృద్ధులకు ఆహారం, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ పోసికుమార్ మాట్లాడుతూ ముద్దాల అను ఎల్లప్పుడూ సామాజిక సేవలో ముందు ఉంటారన్నారు. కార్యక్రమంలో కేవీ నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహాల ఊరేగింపు


సీతానగరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వీధిలోని గణపతి విగ్రహం ఊరేగింపు

సీతానగరం: వినాయక చవితి ఉత్సవాలకు ముగిసిన నేపథ్యంలో నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం సీతానగరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం దగ్గరలో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని ఊరేగించారు. తీన్‌మార్ డప్పులు, నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి వంగలపూడి రేవు వద్ద గోదావరిలో నిమజ్జన చేశారు. సీతానగరం బస్టాండ్ సెంటర్, లంకూరులో నెలకొల్పిన గణపతి విగ్రహాల నిమజ్జనం అనంతరం గురువారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరం, చినకొండేపూడి, సింగవరం గ్రామాల విగ్రహాలను వంగపూడిలో, కూనవరం, ముగ్గళ్ల, రఘుదేవపురం, ఇనుగంటివారిపేట గ్రామాల విగ్రహాలను ముగ్గళ్లలో, రాజంపేట, మునికూడలి, కాటవరం విగ్రహాలను మునికూడలిలో, బొబ్బిల్లంకలోని విగ్రహాలను ఆ గ్రామ రేవులలో నిమజ్జనం చేస్తున్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

కంబాలచెరువు: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 20 లీటర్ల సారాను పోలీసులు గురువారం పట్టుకున్నారు. పీఅండ్‌టీ కాలనీకి చెందిన ఎస్.రాజు తన ఇంటివద్ద సారా విక్రయిస్తున్నాడు. విషయం తెలిసిన పోలీసులు ఆ ప్రాంతంలో దాడి చేసి రాజు వద్దనున్న సారాను పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు.